బ్రిటిష్ పాలనలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు

భారతదేశం వలస ఆర్థిక వ్యవస్థగా ఉన్న సమయంలో పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో విద్యా వ్యాప్తి కోసం చేసిన కృషి చాలా తక్కువ. గ్రామీణ సమాజం, కుల వ్యవస్థ, అంటరానితనం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, వ్యవసాయ రంగంలో అవలంబించే పద్ధతుల విషయంలో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. ఆర్థిక, సాంఘిక అభివృద్ధిలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రభావం చాలా పరిమితం. జనాభాతోపాటు మొత్తం ఉత్పత్తిలోను పెరుగుదల సంభవించినప్పటికీ.. తలసరి ఉత్పత్తిలో పెరుగుదల నమోదు కాలేదు.



దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం 1805 నాటికి 31,000 మంది సిబ్బందితో పాలన బాధ్యతలు నిర్వహించేది. 1911 నాటికి సిబ్బంది సంఖ్య 1,64,000 చేరుకుంది. 1931లో 1,68,000కు పెరిగింది. ఆ రోజుల్లో ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం తక్కువగా ఉండాలనే అభిప్రాయం ఉండేది. దాంతోపాటు సిబ్బంది కూడా తక్కువ స్థాయిలో ఉండటంతో బ్రిటిష్ పాలనలో పన్ను రేట్లు తక్కు వగా ఉండేవి. బ్రిటిషర్లు 'మొగలుల కాలం నాటి పన్నుల వ్యవస్థ'ను అనుసరించారు. ఈ విధానంలో భూమి శిస్తు..జాతీయాదాయంలో 15 శాతానికి సమానంగా ఉండేది. వలస పాలన అంతమయ్యే నాటికి దేశంలో భూమి శిస్తు ద్వారా వచ్చే ఆదాయం జాతీయాదాయంలో 1 శాతానికి సమానంగా ఉండి మొత్తం పన్ను భారం 6 శాతంగా ఉండేది. పన్ను భారం తక్కువగా ఉండడంతో భూస్వాములు ఎక్కువగా లబ్ధి పొందారు. తక్కువ పన్ను భారాన్ని సాధారణ ప్రజలకు వర్తింపచేయలేదు. దీంతో బ్రిటిష్ పాలనలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. అంతేకాకుండా పట్టణ ప్రాంతాల్లో 'పారిశ్రామిక పెట్టుబడి దారులు' అనే నూతన వర్గం ఆవిర్భవించింది.

వ్యవసాయ రంగం:

మొగలుల కాలంలో జమిందారులు భూమిశిస్తులో 10 శాతాన్ని తమ దగ్గర పెట్టుకునేవారు. కాని బ్రిటిష్ పాలన అంతమయ్యే నాటికి జమిందారులు తాము ప్రభుత్వానికి చెల్లించిన పన్ను మొత్తం కంటే అనేక రెట్ల ఆదాయం బాటకం ద్వారా పొందగలిగారు. ప్రతి గ్రామం లోను ఆధిపత్య కుటుంబాలు 'టెనెంట్స్ ఇన్ చీఫ్ (Tenants in chief)' గా వ్యవహరించి అనేక హక్కులను సొంతం చేసుకున్నారు. వీరికి నిమ్న కులాలకు చెందిన కుటుంబాల వారు 'ఉప కౌలుదారులు'గా వ్యవహరించే వారు. బెంగాల్‌లో 1772లో వారెన్ హేస్టింగ్స్ పరిపాలనలో భూయజమానుల సంఖ్య 100కు మించకపోయి నప్పటికీ.. తర్వాత కాలంలో వీరి సంఖ్య 1,54,200కు పెరిగింది. జనాభా పెరిగే కొద్ది భూమి కొరత ఏర్పడటం, భూమి శిస్తు తీవ్రత తక్కువగా ఉండటం వంటి రెండు అంశాలాధారంగా వీరి ఆదాయాలు కూడా పెరిగాయి. మొగలుల విధానంలో భూమి శిస్తు, పంట ఉత్పత్తి విలువలో 30 శాతం ఉండేది. కాగా 1947 నాటికి భూమి శిస్తు వ్యవసాయాదాయంలో 2 శాతం మాత్రమే. దీని వల్ల గ్రామాల ఆదాయం పెరగడంతోపాటు గ్రామీణ ప్రజల మధ్య ఆదాయ వ్యత్యాసాలు పెరిగాయి. జార్జ్ బ్లైన్ (George Blyn) అభిప్రాయంలో .. 1893 నుంచి 1948 మధ్యలో పంటల ఉత్పత్తి వృద్ధి 3 శాతం కాగా జనాభా పెరుగుదల మాత్రం 46 శాతం. 1966లో తాను చేపట్టిన రెండో పరిశోధనలో పంటల ఉత్పత్తి వృద్ధి 16.6 శాతంగా అంచనా వేశారు. బ్రిటిష్ పాలనలో వ్యవసాయ రంగంలో వ్యాపారీకరణ ధోరణి పెరిగింది. జనాభా 165 మిలియన్ల (1757 నాటికి) నుంచి 420 మిలియన్లకు పెరిగింది. భూయాజమాన్య పద్ధతుల్లో వచ్చిన మార్పులు, వృథా భూములు వ్యవసాయ యోగ్యంగా అభివృద్ధి చెందడం వంటి కారణాలతో వ్యవసాయ ఉత్పత్తుల్లో పెరుగుదల నమోదు అయింది. అంతేకాకుండా 1/3 వ వంతు భూములకు నీటిపారుదల వసతులు సమకూరాయి. పంజాబ్, సింధ్ ప్రాంతాల్లోని భూములకు నీటి పారుదల సౌకర్యాలు ఎక్కువగా కల్పించారు. రవాణా సౌకర్యాలు ముఖ్యంగా రైల్వే రవాణా పెరగడం వల్ల వాణిజ్య పంటల కు సంబంధించి కొంత ప్రత్యేకీకరణ పెరిగిందని చెప్పా చ్చు. పంట దిగుబడులు పెరిగినప్పటికీ..దేశంలో వ్యవసాయం 'జీవనాధార వ్యవసాయం' గానే మిగిలిపోయింది. పంచదార, జూట్ (జౌళి),టీ ఉత్పత్తులు ప్రధాన ఎగుమ తులుగా నిలిచాయి. వీటి ఎగుమతులు పెరిగినప్పటికీ.. స్థూల పంట ఉత్పత్తి విలువలో టీ, జౌళి వాటా 3.5 శాతం మాత్రమే. వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి సంబంధించి జరిగిన ప్రయత్నం తక్కువ. విత్తనాల అభివృద్ధిలో కొంత పురోగతి సాధించిన.. ఎరువులు, వ్యవసాయ ఎక్స్‌టెన్షన్ సర్వీలు, లైవ్‌స్టాక్ విషయంలో

ఎటువంటి ప్రగతి సాధ్యం కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంపై పన్ను భారం తక్కువైనందువల్ల గ్రామీణ వినియోగం పెరిగింది. ఈ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల తలసరి లభ్యత మొగలుల కాలంలో కంటే.. బ్రిటిష్ పాలన చివరిదశలో ఎక్కువ అని భావించవచ్చు.

బ్రిటిష్ కాలంలో కరువు కాటకాలు, అంటు వ్యాధుల సమస్యలు ఎక్కువ. 1876-88, 1899-1900 మధ్య కాలంలో కరువు కాటకాల వల్ల అనేక మిలియన్ల మంది ప్రజలు చనిపోయారు. 1890లో ప్లేగు వ్యాధి, 1919లో ఇన్‌ఫ్లూయింజా అంటు వ్యాధులు పెరిగాయి. 1920, 30 లలో ఎటువంటి కరువు కాటకాలు సంభవించలేదు. యుద్ధ వాతావరణం, రవాణా సమస్యల కారణంగా 1944 లో 'బెంగాల్ కరువు' ఏర్పడింది. ప్రజారోగ్య పరిరక్షణ దిశగా బ్రిటిష్ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 'స్మాల్‌ఫాక్స్ వాక్సినేషన్' ప్రవేశ పెట్టడం, వెస్ట్రన్ మెడిసిన్, డాక్టర్లకు శిక్షణ ఇవ్వడం వంటి పద్ధతులను అమలు చేసింది.

పారిశ్రామిక రంగం:

భారత్‌లోని బ్రిటిష్ ప్రభుత్వం వినియోగవస్తు పరిశ్ర మలను అభివృద్ధి పరచింది. మూలధన వస్తు పరిశ్రమలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. నెపోలియన్ యుద్ధం తర్వాత ఇంగ్లండ్ నుంచి వస్త్రాలను దిగుమతి చేసుకోవడంతో దేశంలో పారిశ్రామిక రంగం సమస్యలను ఎదుర్కొంది. 1896-1913 మధ్య దిగుమతి చేసుకున్న వస్త్రాలు.. మొత్తం వస్త్ర వినియోగ అవసరాల్లో 65 శాతం అవసరాలను తీర్చాయి. దీంతో గ్రామీణ మహిళల కార్యకలాపమైన హోమ్ స్పిన్నింగ్ (చేనేత) దెబ్బతింది. యంత్రాల సహాయంతో తయారైన ఉత్పత్తుల ధాటికి చేనేత పరిశ్రమ పలు సమస్యలను ఎదుర్కొంది. అమెరికా, ఫ్రాన్స్‌లలో మాదిరి రక్షణ విధానాన్ని ఇక్కడి వస్త్ర పరిశ్రమ విషయంలో అనుసరించినట్లయితే సాంకేతిక ప్రగతి సాధ్యమయ్యేది. ఎటువంటి దిగుమతి సుంకాలు లేకుండా బ్రిటిష్ ఉత్పత్తులు దేశంలోకి ప్రవేశించేవి. ఉత్పత్తులపై ఎక్సైజ్ పన్ను విధింపు కారణంగా స్వదేశీ ఉత్పత్తులు 'కాంపిటీటివ్ అడ్వాంటేజ్' కోల్పోయాయి. తద్వారా పారి శ్రామికాభివృద్ధి కుంటుపడింది. భారత్ రాజకీయ పరంగా స్వతంత్ర దేశంగా ఉన్నట్లయితే పన్ను వ్యవస్థను చాలా స్పష్టంగా రూపొందించి ఉండేది. 1880లలో భారత్ 'కస్టమ్స్ రాబడి' మొత్తం వాణిజ్య టర్నోవర్‌లో 2.2 శాతం మాత్రమే. అదే సమయంలో బ్రెజిల్ కస్టమ్స్ రాబడి మొత్తం వాణిజ్య టర్నోవర్‌లో 21 శాతంగా ఉండేది.

బ్రిటిషర్లతో ద్రవ్య లావాదేవీలు నిర్వహించే భారత క్యాపిటలిస్టులు 1850లలో 'మొదటి టెక్స్‌టైల్ మిల్లు'ను ఏర్పాటు చేశారు. బొంబాయిలో కాటన్ టెక్స్ టైల్స్ ప్రారంభమైంది. దీనికి కావాల్సిన ఆర్థిక, యాజమాన్య సహకారాన్ని బ్రిటిష్ వాణిజ్య కంపెనీలు అందించాయి. ఆసియా ఖండంలోనే మొదటి ఆధునిక టెక్స్‌టైల్ పరిశ్రమ భారత్‌లో ఏర్పడింది. తర్వాత 20 సంవత్సరాలకు జపాన్‌లోను, 40 ఏళ్లకు చైనాలోను ఆధునిక మిల్లులను స్థాపించారు. బొంబాయిలో 1851లో కాటన్ మిల్స్ ఏర్పాటయ్యాయి. అదే సమయంలో దేశంలో 'ఆధునిక జౌళి తయారీ' ప్రారంభమయ్యింది. మొదటి జౌళి మిల్లు 1854లో కలకత్తాలో ప్రారంభమై ఆ తర్వాతి కాలంలో దేశమంతా విస్తరించింది. 1879 నుంచి 1913 మధ్యలో వస్త్ర పరిశ్రమ కంటే జౌళి పరిశ్రమ ఎక్కువ వృద్ధి నమోదు చేసుకుంది. జౌళి పరిశ్రమ అభివృద్ధికి ముఖ్య కారణం పేదరికం ఎక్కువగా ఉన్న స్వదేశీ మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడకుండా ఎగుమతులపై ఆధారపడటమే.

బెంగాల్‌లో కోల్ మైనింగ్ పరిశ్రమ ఎంతో ప్రాధాన్యం పొందింది. 1914లో దీని ఉత్పత్తి 15.7 మిలియన్ టన్నులు. దేశంలో రైల్వేల డిమాండ్‌ను ఈ పరిశ్రమ తీర్చగలిగింది. 1907లో మొదటి 'ఇండియన్ స్టీల్ మిల్లు'ను జంషెడ్‌పూర్‌లో టాటా కంపెనీ నిర్మించింది. మొదటి ప్రపంచ యుద్ధం ముందు కాలంలో ఈ మిల్లులో ఉత్పత్తి ఎక్కువగా జరగలేదు. చైనాలో 1896లో హాంగ్ యాంగ్‌లో మొదటి స్టీల్ మిల్లును నిర్మించిన 15 సంవత్సరాల తర్వాత భారత్‌లో స్టీలు మిల్లును నెలకొల్పారు. చైనా, జపాన్‌లలో ఏర్పాటైన స్టీలు మిల్లు, మొదటి టెక్స్‌టైల్ మిల్లు ప్రభుత్వ రంగంలో ఏర్పాటయ్యాయి.

స్వదేశీ ఉద్యమంతో..:

భారత్‌లో 1905లో వచ్చిన స్వదేశీ ఉద్యమం పారిశ్రా మిక, బీమా, బ్యాంకింగ్ రంగాల వృద్ధికి దోహదపడింది. విదేశీ వస్తువుల బహిష్కరణ కొన్ని పరిశ్రమల అభివృద్ధికి అవకాశమిచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటన్ నుంచి దిగుమతుల కారణంగా స్వదేశీ మార్కెట్‌లో ఉక్కు, వస్త్రాలకు డిమాండ్ ఏర్పడింది. యుద్ధం తర్వాత దేశంలో తయారైన ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇచ్చే విధానంలో భాగంగా 'టారిఫ్ కమిషన్'ను ఏర్పాటు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించింది. రక్షణ విధానంలో భాగంగా దిగుమతి సుంకాలు పెంచారు. యుద్ధం ముందు కాలంలో సగటు దిగుమతి సుంకాలు 5 శాతం మాత్రమే కాగా 1925 నాటికి సగటు దిగుమతి సుంకం 14 శాతానికి చేరుకుంది. జపాన్ నుంచి ఎదు రయ్యే పోటీ

ఆసియా నుంచి ఎగుమతులు (1850-1950) (మిలియన్ డాలర్లలో)

దేశం	1850	1913	1937	1950
శ్రీలంక	5	76	124	328
చైనా	24	294	516	700
భారత్	89	786	717	1178
ఇండోనేషియా	24	270	550	800
జపాన్	1	354	1207	820
మలేషియా	24	193	522	1312
ఫిలిప్పీన్స్	–	48	153	331
థాయ్‌లాండ్	3	43	76	304

నుంచి స్వదేశీ టెక్స్‌టైల్ పరిశ్రమను రక్షించ డానికి బ్రిటిష్ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. 1930–34 మధ్య కాలంలో కాటన్ వస్త్రాలపై దిగుమతి సుంకాన్ని 11 నుంచి 50 శాతానికి పెంచింది. 1896 నాటికి దేశంలో మొత్తం వస్త్ర వినియోగ అవసరాలలో 6 శాతం మాత్రమే స్వదేశీ పరిశ్రమలు తీర్చేవి. క్రమంగా పరిశ్రమ విస్తరిస్తూ 1913లో 20 శాతం, 1936లో 62 శాతం, 1945 లో 76 శాతం డిమాండ్‌ను తీర్చగలిగాయి. 1833 తర్వాత దేశంలో పంచదార ఎగుమతులు పెరిగినప్పటికీ.. ఉత్పత్తి విషయంలో ఏ విధమైన తులనాత్మక ప్రయోజనం చేకూరలేదు. మిగతా దేశాలతో పోల్చినప్పుడు 1913–37 మధ్యలో భారతదేశంలో ఎగుమతులు తగ్గాయి. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో జాతీయాదాయంలో ఎగుమతుల వాటా 5 శాతం మాత్రమే. 1850 నుంచి 1950 మధ్యలోఎగుమతుల ప్రగతి పరిశీలించినపుడు.. ఆసియా దేశాలన్నింటి కంటే మన దేశంలో ఎగుమతుల వృద్ధి తక్కువ అని చెప్పొచ్చు.

ముఖ్యాంశాలు

- దేశంలో మొదటి టెక్స్‌టైల్ మిల్లు 1850లో ఏర్పాటు.
- మొదటి జౌళి మిల్లు కలకత్తాలో 1854లో ప్రారంభం.
- మొదటి ఇండియన్ స్టీల్ మిల్లును 1907లో జంషెడ్‌పూర్‌లో నెలకొల్పిన టాటా కంపెనీ.
- మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో 'టారిఫ్ కమిషన్' ఏర్పాటు.
- పారిశ్రామిక, బీమా, బ్యాంకింగ్ రంగాల వృద్ధికి దోహదపడిన స్వదేశీ ఉద్యమం.